క్లుప్తంగా

జీఓ 19ని రద్దు చేయాలి

గట్టు: కురువ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసేందుకు ఉద్దేశించిన జీఓ19ని ప్రభుత్వం రద్దు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. దళితుల ఉద్యోగ, రాజకీయ ప్రయోజనాలను దొడ్డి దారిన పొందడానికి బీసీ కురువ సోదరులు ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. నిజమైన దళితులకు అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మాదాసి కుర్వలు ఈ ప్రాంతంలో లేరని, జీఓ 19ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దళితులంతా ఐక్యంగా జీఓ 19ను రద్దు చేసేందుకు అప్రమత్తం కావాలని కోరారు.

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కమిటీ నియామకం

గద్వాలన్యూటౌన్: పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా గద్వాల ప్రాంతానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డిని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌టీయూ టీఎస్ జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షులుగా టీ.తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శిగా సాతర్ల రఘును నియమించినట్లు పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసు నమోదు

అలంపూర్ రూరల్: కర్నూల్ జిల్లా ఆలూరుకు చెందిన రామసుబ్బారెడ్డి వారి మిత్రులపై ఫిర్యాదు చేయడంతో గురువారం కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు అలంపూర్ ఎస్‌ఐ మడుగు రమేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని ర్యాలంపాడ్‌కు చెందిన బాలాజీ(20) రాఘవేంద్ర పంట పొలాలను పరిశీలించేందుకు బైక్‌పై వెళ్తుండగా, ఆలూరు గ్రామస్తులు రామసుబ్బారెడ్డి మిత్రులతో కలిసి కారులో వెళ్తున్నారు. కారును ఓవర్‌టేక్ చేయడంతో ఇరువురి మధ్య గొడవకు చోటుచేసుకుంది. దీంతో బాలాజీని కారుతో ఆలూరు గ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన వెంటనే ర్యాలంపాడు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించి ఆలూరు వెళ్లారు. వెంటనే ఎస్‌ఐ రమేష్ పోలీస్ సిబ్బందితో ఆలూరు చేరుకొని ఇరువురి మధ్య గొడవ జరగకుండా ఆపాడు. అనంతరం బాలాజీని ర్యాలంపాడు గ్రామస్తులకు అప్పజెప్పారు. గదిలో వేసి చితకబాదినట్లు బాలాజీ చెప్పడంతో రామసుబ్బారెడ్డి అతని మిత్రులపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అలంపూర్ రూరల్: మండలంలోని శింగవరం శివారులో తుంగభద్ర నది సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గురువారం ఎస్‌ఐ రమేష్ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కర్నూల్ జిల్లా పూడూరుకు చెందిన రాజుతో పాటు మరొకరు ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రెండు ట్రాక్టర్లను తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓటరు నమోదు



ఆత్మకూర్: 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు నమోదు చేయించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ నెల 20, 21వ తేదీల్లో గ్రామాల్లో పర్యటించి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటుహక్కు కోసం నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

సైబర్ నేరం: కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరంపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వనపర్తి పట్టణంలోని సాయినగర్‌కాలనీకి చెందిన మహేందర్ ఈ నెల 4న ఫోన్ యాప్ బ్లాక్ అయ్యిందని మెసేజ్ వచ్చింది. తను వెంటనే ఆ లింక్‌ను ఓపెన్ చేస్తే ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీని వెంటనే ఎంటర్ చేయగా.. ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.50 వేలు కొట్టేశారు. వెంటనే ఎస్‌బీఐ నాగవరం, మేనేజర్‌ను సంప్రదించగా ఆన్‌లైన్ ద్వారా మోసం అని తెలుసుకొని వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బహుమతుల అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో విన్నర్‌గా నిలిచిన విజేత కీర్తి రైడర్స్ జట్టుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.20 వేలు, రెండో బహుమతి అనివిడ్ సైకర్స్ రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, వెంకటస్వామి, నరేష్, ప్రవీణ్, బలరాంనాయక్, ఆనంద్, గుడిసె ధర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక యాప్‌తో 'పల్లె ప్రగతి'

- పనులపై నిత్యం అధికారుల పర్యవేక్షణ
- రోజువారీ పనులు ఆన్‌లైన్‌లో అప్లోడ్
- అభివృద్ధిలో అధికారుల భాగస్వామ్యం
- పల్లెల్లో మెరుగవుతున్న పారిశుద్ధ్యం



ఆర్ గార్లపాడు గ్రామపంచాయతీ కార్యాలయం



కోదండాపురంలో పల్లె ప్రగతి పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉన్నతాధికారుల (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, మల్టీపర్పస్ కూలీలను ఏర్పాటు చేశాక పంచాయతీలలో కార్మికులు నిత్యం వీధుల్లోకి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం రోజు రోజుకు మెరుగు పడింది. అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలలో ఈ ప నులను మరింతగా మెరుగ్గా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. గ్రామాల్లో రోజువారి పనులు ఎలా ఉన్నాయి, పల్లె ప్రగతి పనులు ఎలా కొనసాగుతున్నాయో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా నిత్యం గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు నేరుగా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శులు రోజువారీగా చేపట్టాల్సిన పారిశుద్ధ్యం నివేదికలను కూడా తయారు చేస్తారు. వారు చేపట్టిన పనులకు సంబంధించిన మానిటరింగ్ రిపోర్టు తయారు చేసి పంపిస్తారు. దీనిలో అప్‌లోడ్ చేసిన ఫొటోలను, గ్రామాల్లో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను రాష్ట్రస్థాయిలో ఏర్పా టు చేసిన బృందం యాప్ ద్వారా ఎప్పటికప్పుడూ పరిశీలించి పనులపై కార్యదర్శులకు తగిన సూచనలు, సలహాలు చేస్తున్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ 'పల్లె ప్రగతి' యాప్‌లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆ యా శాఖల అధికారులను భాగస్వామ్యం చేసింది. దీనిలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారి, డీఎల్‌పీఓ, బీఎల్‌పీఓలు కూడా భాగస్వాములై ఉన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ప్రతిరోజూ కార్యదర్శులు ఏ పని చేయాలో ఫోన్‌కు నేరుగా సంక్షిప్త సందేశం వస్తోంది. దీనిలో భాగంగా పారిశుద్ధ్యం పనులపైనే గ్రామాల్లో అధికారులు ప్ర త్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వ ప నిదినాలలో ఉదయం 7నుంచి రాత్రి 7గంటల వర కు ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. ఇందులో నిత్యం జరిగిన పనుల వివరాలతో పాటు సంబంధిత ఫొటోలను కార్యదర్శులు అప్‌లోడ్ చేస్తారు. దీనిలో భాగంగా పల్లె ప్రగతి పనులు, వాటర్ ట్యాంకు శుభ్రత, పంచాయతీ పాలన, నివేదిక నిర్వహణ, ధ్రువపత్రాల ఆమోదం, జనన, మరణాల నమో దు, ఆదాయం, ఖర్చులు, చెక్కులు ఇవ్వడం, కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, గ్రామ సభల నిర్వహణ, ఉపాధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు కార్యదర్శులు ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పరిశుభ్రత మెరుగు పడింది..



గ్రామంలో నిత్యం చేపడుతున్న పనుల సమాచారాన్ని, పారిశుద్ధ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను రోజు వారీగా యాప్‌లో అప్‌లోడ్ చే స్తున్నాం. పనిచేయడానికి ముందు ఫొటో, పనిచే సిన తర్వాత పనుల ఫొటోలతో పాటు పూర్తి వివరాలను నేరుగా పంపిస్తున్నాం. దీనివల్ల గ్రామా ల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిని పెట్టడంతో పల్లెల పరిశుభ్రత మెరుగు పడింది. – కౌసల్య, పంచాయతీ కార్యదర్శి, సోసనూలు జీపీ

పారదర్శకత పెరిగింది..



మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో రోజు వారీగా జరిగే పనుల వివరాలను కార్యదర్శులు ఎప్పటికప్పుడూ పల్లె ప్రగతి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పల్లెల అభివృద్ధితో పాటు పారిశుద్ధ్యం పనులలో ప్రస్తుతం పారదర్శకత పెరిగింది. ఎక్కడైనా జీపీలలో అభివృద్ధి పనులు సక్రమంగా జరగకపోతే హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయం నుంచి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి నేరుగా ఫోన్‌కాల్ వస్తుంది. – భాస్కర్, మండల పంచాయతీ అధికారి, ఇటిక్యాల

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీచైర్ పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

గద్వాల అర్బన్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అసంపూర్తిగా ఉన్న జిల్లా కేంద్రంలోని 300పడకల ఆస్పత్రి పనులను త్వరితగతిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, 500 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేయాలని కోరారు. నర్సింగ్ కళాశాలకు మౌలిక వసతులు కల్పించాలని, మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలని, నడిగడ్డ ప్రజలకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.నడిగడ్డ ప్రజలకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

అలంపూర్: నియోజకవర్గంలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరినట్లు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తెలిపారు. హైదరాబాదులోని సచివాలయంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్ కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు, సర్పంచ్ రవికుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంజిలు గురువారం కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు సేవలు మెరుగుపర్చాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని రాజోళి మండలం చిన్న ధన్వాడ, అలంపూర్ మండలంలోని భీమవరం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. స్పందించిన మంత్రి బస్సు సౌకర్యం కల్పించడానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి దామోదర రాజనర్సింహలను కలిసినట్లు తెలిపారు. ఇటిక్యాల మండలం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆహ్వానించినట్లు తెలిపారు.

మిషన్ భగీరథ ట్యాంకు శుభ్రం



వాటర్ ట్యాంక్‌ను శుభపరుస్తున్న సిబ్బంది

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీరు అపరిశుభ్రంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గతకొంత కాలంగా ట్యాంక్‌ను సిబ్బంది శుభ్రపరచడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు వల్ల ప్రజలు రోగాలు పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఉదయం వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచినట్లు తెలిపారు.

ఘనంగా ఎన్‌టీఆర్ వర్ధంతి



ఎన్‌టీఆర్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

అయిజ: మండల కేంద్రంలో గురువారం దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ 28 వర్ధంతిని అభిమానులు నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సినీనటుడు జూనియర్ ఎన్‌టీఆర్‌కు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ అభిమాని సుధాకర్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ అభిమానులు సుధాకర్‌గౌడ్, శ్రీధర్, శివరాజ్, వెకంటేష్, భీమన్న, వీరన్న గౌడ్, రాముడు, కృష్ణారెడ్డి, నాగన్న, వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

శాంతినగర్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత ఎన్టీఆర్ 28వ వర్ధంతిని వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో గురువారం నిర్వహించారు. శాంతినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ కరుణ, టీడీపీ నాయకులు పూర్ణచంద్రరావు, సాయికుమార్, కిష్టన్న, పూర్ణయ్య, వెంకట్రామన్, జేఏసీ నాయకులు రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

గద్వాల అర్బన్: దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని టీడీపీ నాయకుడు గంజిపేట రాములు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. గద్వాల మండలంలో చెనుగోనిపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బుక్కులు పంపిణీ

పెబ్బేరు రూరల్: దాడి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం గురువారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన వారి కుమారుడు దాడి కిష్టారెడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు, పండ్లు, బిస్కెట్లు, ఫ్రూట్ జ్యూస్, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ యాదవ్,రాములుయాదవ్, కురుమన్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



వాహనాలను తినిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేష్ కుమార్

అయిజ: రోడ్డుపై ప్రయాణించే వారందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ నరేష్‌కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలో చిన్న తాండ్రపాడు క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతిఒక్కరు హెల్మెంట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని అన్నారు. వాహనాలకు తప్పని సరిగా అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపడం వల్ల, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోయారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయం



ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు జయసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో జరిగే ఉత్సవాల మాదిరిగా పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

బీచుపల్లిలో స్వచ్ఛ అభియాన్



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న వికాస్ తరంగిణి కార్యకర్తలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ప్రధానమంత్రి ఆదేశాల మేరకు గురువారం వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో స్వచ్ఛఅభియాన్ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన వికాస్ తరంగిణి కార్యకర్తలు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజరు సురేందర్‌రాజు, ఈశ్వరయ్య, కాంతారెడ్డి, హరి, రామన్న, సునీతమ్మ, అనంతరెడ్డి, సత్యం, మద్దిలేటి ఉన్నారు.

భారీ వాహనాలతో ముప్పు



శిథిలమైన కల్వర్టును పరిశీలిస్తున్న ఏఈ గోపాల్

అయిజ: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్లు, కల్వర్టులు ధ్వంసమవుతున్నాయని, వాటిని నిరోధించాలని మున్సిపల్ ఏఈ గోపాల్ అన్నారు. పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో శిథిలమైన కల్వర్టుకు మున్సిపల్ సిబ్బందితో గురువారం మరమ్మతులు చేసే పనులు చేపట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ ఏఈ గోపాల్ మాట్లాడారు. పాతబస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్యలో పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తుండడంతో ప్రధాన రహదారులపై వెవెళ్లాల్సిన భారీ వాహనాలు పట్టణంలోని చిన్న చిన్న రోడ్లపై తిరగుతున్నాయని, దానివల్ల రోడ్లు, కల్వర్టులు ధ్వంసమవుతున్నాయని వాపోయారు. పట్టణంలో 20 టన్నుల బరువు కలిగిన వాహనాలు వెళ్లేందుకు నిర్మించిన రోడ్లు, కల్వర్టులపై 40 నుంచి 50 టన్నుల బరువు కలిగిన భారీ వాహనాలు వెళ్తున్నాయని తెలిపారు. దానివల్ల పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో తెలుగుతల్లి విగ్రహం వద్ద రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన కల్వర్టుకు రంధ్రం పడిందని పేర్కొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవు



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అయిజ: పట్టణంలోని వివిధ కాలనీల్లో గురువారం మున్సిపల్ సిబ్బంది ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ఇంటింటికి తిరిగారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ మాట్లాడారు. మున్సిపాలిటీలో నివాస గృహాలు, వ్యాపార సంబంధిత భవనాలకు ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలని కోరారు. కొన్ని నివాస గృహాలకు, వ్యాపార సంబంధిత భవనాలకు గత కొన్ని సంవత్సరాలనుంచి కొంతమంది ఆస్తపన్ను చెల్లించలేదని వాపోయారు. దానివల్ల ఆస్తిపన్ను రూ. లక్షల్లో బకాయి పడిందని పేరుకున్నాయని తెలిపారు. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించనివారిపై చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్లు తెలిపారు.

ఓటర్ జాబితాలో తప్పులుండొద్దు



మాచర్లలో ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్

గట్టు: ఓటర్ జాబితాలో తప్పుల్లేకుండా రూపొందించుదామని, దీనికి క్షేత్ర స్థాయిలో బూత్ లేవల్ అధికారులు పరిశీలన పక్కాగా ఉండాలని తహసీల్దార్ ధనుంజయ్ కోరారు. గురువారం మాచర్లలో బూత్ లేవల్ అధికారులతో తహసీల్దార్ ధనుంజయ్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌లు సమావేశమయ్యారు. ఓటర్ జాబితాకు సంబంధించిన పలు అంశాలపై బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి వెరిఫికేషన్, ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, చనిపోయిన ఓటర్లను గుర్తించి, ఓటర్ జాబితా నుంచి తొలగించే విషయాలపై అవగాహన కల్పించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేరువేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే వారిని ఒకే చోట చేర్చే విషయాన్ని పరిశీలించాలన్నారు. ఓటర్ జాబితాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. ఓటర్ జాబితాను తప్పుల్లేకుండా తయారు చేసేందుకు సహకరించాలని కోరారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం



మద్దెలబండ పెద్దతండాలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న నాయకులు

మల్దకల్: మండలంలోని మద్దెలబండపెద్దతండాలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ విజేతలకు గురువారం సర్పంచ్ తాన్యనాయక్, శివనాయక్‌లు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు తండాలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో మద్దెలబండ చిన్నతండా, మొదటి, రెండో బహుమతులు గెలపొందారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో 13 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.గామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మల్దకల్‌లో 31న టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

మల్దకల్: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఈ నెల 31న నడ్డిగడ్డ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నడ్డిగడ్డ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను గురువారం మల్దకల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సురేష్ సమక్షంలో విడుదల చేశారు. టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

గురుకుల పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత

ఉండవెల్లి: ఉండవెల్లి మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం ముస్లింలకు 51, క్రిష్టియన్లకు 5, సిక్కు 1, బుద్ధ 1, జైన 1, పార్సీ 1, నాన్ మైనార్టీ 20 సీట్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సీఈసీ, హెచ్‌ఈసీ, గ్రూపులకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ మైనార్టీ సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో మొబైల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, సీఓఈ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఇటిక్యాల గురుకుల కళాశాల, పాఠశాల ప్రధానాచార్యులు తిరుపతయ్య గురువారం ఒక ప్రకనటలో తెలిపారు. ఆయా తరగతులలో ప్రవేశానికి విద్యార్థులు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షతలు



శ్రీరాముడి నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

అయిజ: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షతలను మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు గురువారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మానవపాడు: జనవరి 22వ తేదీన అయోధ్య శ్రీరామ ఆలయ ప్రాణ ప్రతిష్ఠలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రతి ఇంటికీ అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముళ్లకంపలు తొలగించండి



కొత్త రాజోళిలోని పునరావాసంలో పెరిగిన ముళ్ల చెట్లు

రాజోళి: మండల కేంద్రంలోని పునరావాస గృహాల్లో ముళ్ల కంపలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వేలాది గృహాలు ఉన్న చోట ముళ్ల కంపలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీటి వల్ల విషసర్పాలు సంచరించడంతో పాటు, పందులు సంచరిస్తున్నాయని, దీని వల్ల రోగాల బెడద పెరుగుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించి ఇళ్ల మధ్య పరిశుభ్ర వాతావరణం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.